# యండమూరి వీరేంద్రనాథ్

# వెన్నెల్లో ఆడపిల్ల



**VENNELO AADAPILLA (Novel)**
*(Serialised in 'Andhra Boomi' weekly)*

*By :*
**YANDAMOORI VEERENDRANATH**
36, U.B.I. Colony,
Road No. 3, Banjara Hills,
**HYDERABAD - 500 034.**
**Ph : 924 650 2662**
yandamoori@hotmail.com
yandamoori.com

**SARASWATHI VIDYA PEETAM,**
Kakinada - Samalkot Road,
MADHAVAPATNAM.

*Publishers :*
**NAVASAHITHI BOOK HOUSE**
Eluru Road, Near Ramamandiram,
Vijayawada - 520 002.
Ph : 0866 - 2432 885
navasahithiravi@gmail.com

*Printers :*
**Nagendra Enterprises**
Vijayawada-3
Ph : 2435115.

*Price :*
₹ 90/-

## PRINTING HISTORY :

| | | |
|---|---|---|
| First Edition | : | Oct. '82 |
| Second Edition | : | Oct. '82 |
| Third Edition | : | Jan. '83 |
| Fourth Edition | : | Jan. '84 |
| Fifth Edition | : | Nov. '84 |
| Sixth Edition | : | Apr. '86 |
| Seventh Edition | : | July '87 |
| Eighth Edition | : | Aug. '90 |
| Ninth Edition | : | Feb. '92 |
| Tenth Edition | : | Oct. '93 |
| Eleventh Edition | : | Oct. '95 |
| Twelveth Edition | : | Jan. '97 |
| Thirteenth Edition | : | Feb. '98 |
| Fourteenth Edition | : | Jan. '99 |
| Fifteenth Edition | : | May 2000 |
| Sixteenth Edition | : | Feb. '02 |
| Seventeenth Edition | : | Jan. '04 |
| Eighteenth Edition | : | July '05 |
| Nineteenth Edition | : | Oct. '06 |
| Twentieth Edition | : | Sep. '07 |
| Twentyfirst Edition | : | May '08 |
| Twenty second Edition | : | Dec. '08 |
| Twenty third Edition | : | Nov. '09 |
| Twenty Fourth Edition | : | Nov. '10 |
| Twenty Fifth Edition | : | Sep. '11 |
| Twenty Sixth Edition | : | June '12 |
| Twenty Seventh Edition | : | April '13 |
| Twenty Eighth Edition | : | Sep.'13 |
| Twenty Ninth Edition | : | July '14 |
| Thirtieth Edition | : | Feb '15 |
| Thirty One Edition | : | Nov '15 |
| Thirty Two Edition | : | July '16 |
| Thirty Three Edition | : | April'17 |
| Thirty Four Edition | : | Jan'18 |
| Thirty Fifth Edition | : | Jan'19 |
| Thirty Sixth Edition | : | Jan' 2020 |
| Thirty Seventh Edition | : | Jan' 2021 |

# వెన్నెల్లో ఆడపిల్ల

నామస్‌గాన్ ఉజ్ బెకిస్తాన్

సమయం: సాయంత్రం అయిదున్నర.

విశాలమైన హాలు. మనుష్యులున్న అలికిడి లేదు కానీ, మెట్లలా ఉన్న విశాలమైన ఆర్చీల మీద కూర్చొని వందలాది జనం ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. అందులో చాలామంది రష్యన్లు, కొందరు భారతీయులు.

రెండు టెలివిజన్ కెమేరాలు నిశ్శబ్దంగా పని చేసుకుపోతున్నాయి.

దూరంగా నిలబడి లెన్స్ సహాయంతో కొందరు ఫోటోలు తీసుకుంటున్నారు.

పోలన్‌స్కీ ముందుకు వంగి ఎదుటి బల్ల మీదకు తీక్షణంగా చూస్తున్నాడు. బల్లమీద తెలుపు-గోధుమరంగు చదరపు గళ్ళు మనిషి జీవితపు గెలుపు ఓటమిల్లా పెనవేసుకుపోయి ఉన్నాయి.

తరువాత ఎత్తు వెయ్యవలసిన పోలన్‌స్కీ గెడ్డం గోక్కుంటూ ఆలోచిస్తున్నాడు. అతడి మినిష్టర్ శత్రువుల మధ్య అష్ట దిగ్భంధనంలో ఉంది.

హాలు మధ్యలో ఉన్న చదరంగపు బోర్డు మీద పావులు ఏయే స్థానాల్లో ఉన్నాయో ఎదురుగా ఉన్న ఎత్తయిన ఎలక్ట్రానిక్ బోర్డు మీద లైట్లు సూచిస్తున్నాయి. ఆ లైట్ల ఆధారంగా కొందరు ప్రేక్షకులు తమ ముందున్న బోర్డుల మీద అదే ఆటని ఆడుతూ నోట్సు వ్రాసుకుంటున్నారు.

ఇదంతా నిశ్శబ్దంగా... ఎవరి ఏకాగ్రతకూ భంగం కలిగించకుండా జరిగిపోతోంది.

పోలన్‌స్కీ తన 'మంత్రి'ని తీసుకొచ్చి ప్రత్యర్థి తాలూకు 'రాజు' ప్రక్కగా ఉంచి నవ్వేడు.

ఏషియన్ ఛాంపియన్ షిప్ ఫైనల్స్ పోటీలవి.

రష్యన్స్ చదరంగంలో ప్రవీణులు. చదరంగం ఆట మనిషి మెదడుని ఎంతో వికసితం చేస్తుందని గ్రహించి, ఆ ఆటని విద్యార్థులకి సబ్జెక్టుగా పెట్టినవాళ్ళు..! బాబీ పిషర్‌లాంటి వాళ్ళు ఏ కొద్దిమందో తప్ప రష్యన్స్‌ని ఓడగొట్టి వరల్డ్ ఛాంపియన్షిప్ సంపాదించినవాళ్ళు ఎవరూ లేరు. అందులోనూ పోలన్‌స్కీ..! గత పదేళ్ళుగా మకుటంలేని మహారాజుగా వెలుగుతున్నాడు. ఈ చిన్న ఏషియన్ ఛాంపియన్‌షిప్ అతడికో లెక్కలోనిది కాదు.

తన మంత్రిని ప్రతిపక్షపు పావుల మధ్యనుంచి వెనక్కి తీసుకొచ్చి రక్షించుకోవటమే కాకుండా – ఆ అడ్డు తొలగించి, బిషప్ ద్వారా 'చెక్' చెప్పటంలో పోలన్‌స్కీ తెలివితేటలు ప్రస్ఫుటమవుతున్నాయి.

ఉన్నట్టుండి భారత ఆటగాడి మీద వత్తిడి ఎక్కువయింది. అతడు ఏం చేస్తాడా అని రష్యన్ ప్రేక్షకులు అతడివైపు ఉత్సుకంగా చూస్తున్నారు. ముఖ్యంగా ఉన్ని కోట్లు కప్పుకున్న అమ్మాయిలు అవహేళన మిళితమైన ముసిముసి నవ్వులతో, అసలే చిన్నటి కళ్ళని మరింత చిన్నవి చేసి చికిలించి చూస్తున్నారు.

గెల్చిన వాళ్ళకి బహుమతి ఇవ్వటానికి ఛీఫ్–గెస్ట్‌గా వచ్చిన భారత రాయబారి కూడా ఒకప్పుడు చదరంగం ఆటగాడు. ప్లేయర్స్ కన్నా ఆయనే ఎక్కువ ఎగ్జైయిటింగ్‌గా ఉన్నాడు. తన దేశపు ఆటగాడు ఏ ఎత్తు వేస్తాడా అని ఊపిరి బిగబట్టి చూడసాగేడు.

కిటికీ బయట అద్దాల మీద తెల్లటి మంచు... దూదిలా జాలువారుతోంది.

భారతదేశపు ఆటగాడు రేవంత్..!

అంత చలిలోనూ అతడి నుదిటి మీద చెమట పడుతోంది. గతంలో ఆడిన పోటీలూ, వేసిన ఎత్తులూ, చదివిన పుస్తకాలూ, వ్రాసుకున్న నోట్సులూ... అన్నీ రీళ్ళలా తిరగసాగేయి. క్రీడాకారుడిగా ఇది తనకి జీవన్మరణ సమస్య అని అతడికి తెలుసు. మెదడులో చేపల కదలికల మల్లె ఆలోచనలు.

వాచీవైపు చూశాడు. టైము రన్ – అవుట్ అవుతోంది.

ఎత్తుకీ ఎత్తుకీ మధ్య ఆటగాడు ఎక్కువ టైమ్ తీసుకోవటానికి వీల్లేదు. గంటకి పదహారు ఎత్తులు వెయ్యాలి. అదీ గాక, మొదటి 2 1/2 గంటల్లో 40 ఎత్తులు వెయ్యాలి.

ఆటగాళ్ళ మధ్య బల్లకి చెరో వైపునా రెండు స్టాప్–వాచీలు బిగించబడి ఉన్నాయి. ఎత్తు వెయ్యగానే తన వాచీ ఆపుచెయ్యాలి. వెంటనే రెండో వాచీ దానంతట అదే ప్రారంభం అవుతుంది. రెండో ఆటగాడు ఎత్తువేసి ఆపుచేసే వరకూ అది తిరుగుతూనే ఉంటుంది. ఎత్తు వేశాక వాచీ ఆపుచేయటం మర్చిపోయి ఓడిపోయిన వాళ్ళూ, 'గంట' లోపులో పదహారు ఎత్తులు వేయలేక ఓడినవాళ్ళూ కోకొల్లలు.

రేవంత్ ఇప్పుడు అదే స్థితిలో ఉన్నాడు.

ఇంకో అయిదు నిముషాల్లో నాలుగెత్తులు ఎలా వెయ్యాలి. ఎలా... ఎలా?

వాచీ తిరిగిపోతోంది. రష్యన్ ఆటగాడి గెలుపు ఖాయం. జనం చప్పట్లు కొట్టటానికి సిద్దంగా ఉన్నారు. ఓడిపోతున్న రేవంత్ ముఖకవళికల్ని పట్టుకోవటం కోసం కెమేరామెన్ మరింత ముందుకి వచ్చాడు.

పోలన్‌స్కీ రిలాక్స్‌డ్‌గా వెనక్కివాలి పైకప్పుకేసి చూస్తూ కూర్చున్నాడు. '...ఇక నీ పని అయిపోయింది సుమా' అన్న సైకిలాజికల్ ఫీల్ ప్రత్యర్థిలో కలిగించటానికి అదొక ఎత్తు. రేవంత్ అయిదు నిముషాల్లో అప్పుడే అర నిముషం గడిచిపోయింది.

అతడు చూపుడువేలతో తన శకటుని ముందుకు జరిపేడు.

పోలన్‌స్కీ వెంటనే నైట్‌ని ముందుకి తీసుకొచ్చాడు.

రేవంత్ బంటుని కదిపేడు.

అతడు చాల డెస్పరేట్‌గా ఉన్నాడని చూసే వాళ్ళకి తెలుస్తోంది.

టైమ్ ఇంకా రెండు నిముషాలుంది.

పోలన్‌స్కీ తేలిగ్గా ఏనుగుని అడ్డంగా జరిపి బంటుని తిన్నాడు.

కేవలం దానికోసమే చూస్తున్నట్లు రేవంత్ చప్పున ఒక మూలనుంచి తన ఏనుగుని తీసుకొచ్చి "చెక్" అన్నాడు.

పోలన్‌స్కీకి గానీ, చూస్తున్న వాళ్ళకి గానీ జరిగిందేమిటో లిప్తపాటు అర్థం కాలేదు. అయోమయంతో కూడిన నిశ్శబ్దంతో అంత పెద్ద హాలూ స్థబ్దమైపోయింది.

అయితే అది క్షణకాలం మాత్రమే. తరువాత ఆనకట్ట దాటి ప్రవాహం దూసుకొచ్చినట్టూ హర్షధ్వానాలతో జనం దూసుకొచ్చారు.

పోలన్‌స్కీ ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు. పైకి డెస్పరేట్‌గా కనబడుతూ, తనలో 'అహాన్ని' పెంచి, కొంచెం నిర్లక్ష్యంగా ఆడేటట్టు చేశాడన్న మాట.

తలెత్తి రేవంత్ వైపు చూశాడు.

జనం అప్పుడే అతడి చుట్టూ చేరిపోయారు. రేవంత్ ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. అమ్మాయిలు మీదపడి ఆటోగ్రాఫులు తీసుకుంటున్నారు. విలేఖర్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఒకదాని మీద ఒకటి ఆగకుండా ఫ్లాష్‌లు వెలుగుతున్నాయి. రకరకాల కోణాల కోసం టి.వి. కెమేరాలు హడావుడిగా తిరుగుతున్నాయి. భారత రాయబారి తన హోదా కూడా మరిచి, సాటి క్రీడాకారుడుగా రేవంత్‌ని గాలిలోకి ఎత్తడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

సాధించింది తక్కువ విజయమేమీ కాదు. ఓడించింది పోలన్‌స్కీని..! పది సంవత్సరాలుగా మకుటంలేని రాజుగా వెలుగుతూన్న ప్రపంచ ప్రఖ్యాత క్రీడాకారుడిని..! వరల్డ్ ఛాంపియన్ కార్పోవ్, స్వీడిష్ గ్రాండ్ మాస్టర్ అండర్సన్‌లు కూడా పోలన్‌స్కీతో ఆడటానికి వెనుకాడతారు. అటువంటివాడిని ఓ ఇరవై అయిదేళ్ళ యువకుడు చివరి క్షణంలో చిత్తు చేసేడంటే, దాని వెనుక ఎన్నో సంవత్సరాల దీక్షా పట్టుదల ఉంటే తప్ప అది సాధ్యం కాదు. ఏదో చివర్లో హడావుడి చేసి గెలిచిన తాత్కాలికమైన గెలుపు కాదిది.

ఒకమ్మాయి చేతిమీద ఆటోగ్రాఫ్ తీసుకుంటూంది. ఓ పన్నెండేళ్ళ కుర్రవాడు రేవంత్‌ని సంభ్రమంగా చూస్తున్నాడు. ఒక ముసలివాడు అతడి భుజం ఆప్యాయంగా తడుతున్నాడు.అందరితో కలిసి రేవంత్ గుంపుగా ఆ గదిలోంచి బైట బాల్కనీలోకి వచ్చేశాడు. అప్పుడే ఈవార్త పాకిపోయినట్టుంది. చాలామంది భారతీయులు, కొందరు రష్యన్స్ అక్కడికి చేరుకుంటున్నారు.

జనం చుట్టుముట్టడం వల్ల రేవంత్ మొహం చెమట పట్టింది. చూసుకుంటే జేబులో చేతిరుమాలు లేదు. ఆడుతున్నప్పుడు జారిపోయినట్టుంది. ఇంతలో బహుమతి తాలూకు అనౌన్స్‌మెంట్ వినిపించటంతో అందరి దృష్టి అటు మళ్ళింది. జనం మధ్య ఖాళీ చేసుకుని, రుమాలు తీసుకోవటం కోసం మళ్ళీ హాల్లోకి వెళ్ళాడు.

అక్కడ దృశ్యం చూసి అతడు స్థబ్దుడయ్యాడు.

నిర్మానుష్యంగా ఉన్న విశాలమైన హాలు. మధ్యలో చదరంగం బల్ల దగ్గర పోలన్‌స్కీ. ముందుకు వంగి... మొహం చేతుల్లోకి దాచుకొని... ఒక్కడే ఒంటరిగా కూర్చొని తనలో తాను రోదిస్తున్నాడు.

రేవంత్ అచేతనంగా అతడిని చూస్తూ ఉండిపోయాడు.

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఒక క్రీడాకారుడి మహాభినిష్క్రమణాన్ని... ఆ స్థానాన్ని ఆక్రమిస్తూన్న మరో క్రీడాకారుడు వ్యథతో గమనిస్తున్నాడు.

అతడికి జాక్ లండన్ ***'స్టీక్'*** అన్న కథ జ్ఞాపకం వచ్చింది. తన 'హయాము' తీరిపోయిందనీ, తన స్థానం ఆక్రమించుకోవటానికి కొత్తతరం వచ్చేసిందనీ పోలన్‌స్కీకి తెలిసిపోయింది. మరో పది సంవత్సరాలు తను ఈ రాజ్యాన్ని ఏలతాడు. తరువాత తను రోదిస్తూ ఉంటే ఇంకో కుర్రవాడు తనని ఇదే సానుభూతితో గమనిస్తాడు.

రేవంత్ చప్పుడు కాకుండా అక్కణ్నుంచి తప్పుకుని బైటకు వచ్చేశాడు.

వస్తూ అనుకున్నాడు– *"విజయమా విజయమా. వస్తూ శిఖరాన్ని ఎక్కిస్తావు. వెళ్తూ పాతాళానికి తోస్తావు. నీకిది న్యాయమా?"*

# 2

## "కంగ్రాచ్యులేషన్స్"

"థ్యాంక్యూ"

"హాయ్ రేవంత్... కంగ్రాట్స్"

"థాంక్స్"

"కంగ్రాట్స్ మిస్టర్ రేవంత్?"

"థ్యాంక్యూ సర్"

అభినందనలు తెలుపుతున్న వాళ్ళకి అతడు మెట్లెక్కుతూ సమాధానం ఇస్తున్నాడు.

పెమన్స్‌లా ప్రొడక్టులో రేవంత్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్. అతడి ఛాంబర్ నాలుగో అంతస్థులో ఉన్నది. అతడు తన ఛాంబర్లోకి వచ్చేసరికి మానేజింగ్ డైరక్టర్ పిలుస్తున్నాడన్న కబురు వచ్చింది. వెళ్ళాడు.

"కంగ్రాచ్యులేషన్స్. ప్రొద్దున్నే పేపర్లో చూశాను..." అన్నాడాయన. థాంక్స్ చెప్పాడు.

"నీవల్ల కంపెనీకి కూడా మంచి అడ్వర్‌టైజ్‌మెంట్ లభిస్తుందోయ్".

రేవంత్ మాట్లాడలేదు. ఒక పెద్ద పోటీలో ఉద్యోగి సంపాదించిన విజయాన్ని కూడా వ్యాపారదృష్టితో చూడగల ఆయన దక్షతకి మనసులోనే జోహార్లు అర్పించాడు. ఈయనే గానీ వ్యాపారం మానేసి చదరంగం ఆడటం మొదలుపెట్టి ఉంటే ఎప్పుడో ప్రపంచ ఛాంపియన్ అయిపోయి ఉండేవాడు.

అక్కణ్నుంచి వచ్చేశాక జనరల్ మేనేజర్ దగ్గరికి వెళ్ళాడు. ఆయన దగ్గర రేవంత్‌కి బాగా చనువు ఉంది. మనిషి ఎప్పుడూ హడావుడిగా ఉంటాడు. పని తప్ప ఇంకొకటి పట్టించుకోడు.

"రావోయ్ రా. ఎందులోనో ప్రైజ్ వచ్చిందని విన్నాను. ఎందులో... కారంబోర్డా?" ఫైల్ లోంచి తలెత్తకుండా అడిగాడు.

"కాదండీ, చదరంగం."

"ఓ. వెరీగుడ్. నీ పేరు పేపర్లో పెద్ద అక్షరాలతో వేశారే. టీమ్ కెప్టెన్‌వా?"

"కాదండీ, చదరంగం ఇద్దరే ఆడతారు."

"ఓహో. అయితే ఎవరితో ఆడి గెల్చావు?"

"పోలన్‌స్కీ అని. వరల్డ్ ఛాంపియన్ సర్" రేవంత్ కంఠంలో కొంచెం గర్వం తొంగిచూసింది.

"అతడెందుకొచ్చాడిక్కడికి?"

"లేదు సర్. నేనే వెళ్ళాను."

"ఎక్కడికి?"

"రష్యా"

"వ్యాట్? ఎప్పుడూ?" నిజాయితీతో కూడిన ఆశ్చర్యంతో అడిగాడాయన.

"మీరే కద్సార్ నాకు క్రిందటివారం శలవు ఇచ్చింది."

"అవునవును కదూ. ఇంతకీ రష్యా ఎందుకు వెళ్ళావు?"

"చదరంగం టోర్నమెంట్‌కి సర్."

"టోర్నమెంటా. ఓ... అయితే మీ టీమ్ నెగ్గిందన్నమాట. గుడ్."

తనమీద తనకే జాలేసి రేవంత్ లేచి వచ్చేస్తోంటే ఆయన, "బయట చాలామంది ఉన్నట్టు హడావుడి ఏమిటి?" అని అడిగాడు.

"ఈ రోజు ఇంటర్వ్యూలు సర్" జ్ఞాపకం చేశాడు.

"అవును కదూ. ఆ విషయమే మర్చిపోయాను. అన్నట్టు ఈ రోజు మరో మీటింగ్ ఉందే. ఎలా?" తనలో తానే గొణుక్కున్నాడు. రేవంత్ మాట్లాడకుండా బైటకి వచ్చేశాడు.

అతడు తన ఛాంబర్స్ కొచ్చేసరికి అక్కడే కూర్చుని ఉన్న జేమ్స్ అతడిని చూసి నవ్వాడు. అతడు మార్కెటింగ్ మానేజర్. కంగ్రాట్స్ చెప్పుకునే దానికన్నా ఎక్కువ స్నేహం వాళ్ళది.

జేమ్స్. అయిదడుగుల ఆరంగుళాల ఎత్తు మనిషి. ఎత్తుకుతగ్గ లావు. నల్లగా ఉన్నా మొహంలో కళ ఉంది. నిర్లక్ష్యమైన కళ్ళు. పదో ఏట తల్లి లేచిపోవటంతో ఆ నిర్లక్ష్యం మొదలైంది. తాగుబోతు తండ్రి పట్టించుకోకపోవటంతో పెరిగింది. స్త్రీ అంటే అతనికి గౌరవం లేదు. అది అతడి తప్పు కాదు. మనసుని తాకినవాళ్ళు లేరు. నిరాసక్తత కేరేపిన్‌ని చేసింది. నిర్లిప్తత నాజూకు భావాల్ని చంపింది. తాగితే రాత్రంతా తాగుతూనే ఉంటాడు. లేకపోతే ఓ నాలుగు నెలలు అస్సలు ముట్టుకోడు.

చాలామంది చెడ్డవాళ్ళు మంచివాళ్ళుగా కనిపించటానికి ప్రయత్నం చేస్తే, ఇతడు పనిగట్టుకుని చెడ్డవాడుగా కనిపించటానికి ప్రయత్నం చేస్తాడు. మనసు పొరల్లోకి తరచి చూస్తే అంతా మంచే. కానీ ఎవరికుంది ఆ ఓపిక? ఆ విధంగా ఆడవాళ్ళలో చాలా చెడ్డపేరు సంపాదించాడు. దానికి ఉదాహరణగా, పెమెన్స్‌లాలో పనిచేసే ఎనిమిదిమంది అమ్మాయిల్లో ఏడుగురికి అతడంటే పడదు. ఇంకొక అమ్మాయి బాలవితంతువు.

ప్రపంచాన్నీ, జీవితాన్నీ ప్రేక్షకుడిగా చూడటం వల్ల, అతడి నిర్లక్ష్యం నుంచి హాస్యం పుట్టింది. అప్పుడప్పుడూ వ్యంగ్యచిత్రాల రూపంలో అది బైటపడుతూ ఉంటుంది. కుదురుగా గీస్తే మంచి కార్టూనిస్టయి ఉండేవాడు. కుదురు లేదు. పత్రికల్లో అప్పుడప్పుడూ కార్టూన్లు పడుతూ ఉంటాయి.

రేవంత్ దీనికి పూర్తిగా వ్యతిరేకం. ఒక గొప్ప చిత్రకారుడు కుదురుగా కూర్చుని గీసిన చిత్రం అతడి జీవితం. చాలా సిస్టమాటిక్. అయిదింటికే లేచి

అరగంట వ్యాయామం చేసి, అయిదు గంటలు చదరంగం ఆడి, ఆపై అరిస్టోక్రసీ కోటేసుకొని ఆఫీసుకొచ్చే ఆ అయిదడుగుల అయిదంగుళాల అబ్బాయి అంతరంగం ఆకాశంలా నిర్మలం, ఆకృతి అరవిందంలా కోమలం.

పదవి కంఠంలో నమ్రతనీ, హోదా మనసులో బిడియాన్నీ పోగొట్టలేదు.

విభిన్న ధృవాలు ఆకర్షించబడినట్టు వాళ్ళు స్నేహితులయ్యారు.

"ఎయిర్‌పోర్ట్‌కి వచ్చాను. నే వచ్చేసరికి విమానం రావడం, వెళ్ళిపోవడం కూడా జరిగిందట" అన్నాడు జేమ్స్.

"చాలా శ్రమ తీసుకున్నావే" నవ్వాడు రేవంత్.

"జెండా ఎగరేసి వచ్చావ్ కదా."

రేవంత్ మొహం మ్లానమై, నవ్వు మాయమైంది. పేరుకున్న నిశ్శబ్దాన్ని చీలుస్తూ అతడు నెమ్మదిగా అన్నాడు: "...నేను సాధించింది తక్కువ విజయమేమీ కాదని నాకు తెలుసు. నేను అభిమానుల్నీ, పూలదండల్నీ, ఘనా ఘనస్వాగతాల్నీ కోరుకోలేదు కానీ, ఎయిర్ పోర్టుకి ఒక్కరంటే ఒక్కరు కూడా రాలేదు. ఫార్మలిటీగా కనీసం ప్రాంతీయ క్రీడామండలి సెక్రటరీ కూడా రాలేదు."

"నువ్వు క్రికెట్ ఆటగాడివి కాకుండా చదరంగం ఆటగాడివి కావటం కారణమా?"

"కాదు. తెలుగువాడిని కావటం కారణం. నేను బాధ పడటంలో తప్పుందా? నీకు తెలియనిదేముంది. నువ్వూ ఆర్టిస్టువేగా. క్రీడాకారుడూ, కళాకారుడూ చిన్నపిల్లలాంటి వారు. వారిపట్ల రవ్వంత ప్రోత్సాహం చూపిస్తే పొంగిపోతారు. అభిమానం కురిపిస్తే, 'మీ విజయాన్ని మేం గమనిస్తున్నాం' అని చెప్తే రెట్టించిన ఉత్సాహంతో మరింత బాగా కృషి చేస్తారు. ఆ అభిమానమే కొరవడుతూంది ఈ రోజుల్లో..."

గుడి గంటలా ఫోన్ మ్రోగింది.

ఫోన్ ఎత్తి తన సహజమైన బిజినెస్ మోనోటోన్‌లో "హలో" అన్నాడు రేవంత్.

అవతలివైపు నుంచి వెంటనే సమాధానం రాలేదు. అతడు విసుగ్గా మరోసారి "హలో" అంటూండగా, "హ... హలో..." అంటూ కాస్త బెదురూ, కొద్ది

ఎగ్జైయిట్‌మెంటూ, మరికొంచెం చిలిపితనం - అన్నీ మిళితమైన ఓ అమ్మాయి స్వరం అవతల్నుంచి వినపడింది. కుర్చీలో చప్పున కదిలి "ఎవరూ?" అన్నాడు.

"నేను... నేను... మీ అభిమానినండీ. కంగ్రాచ్యులేషన్స్ చెబుదామని ఫోన్ చేశాను."

ఒక అపరిచిత వ్యక్తి తనకి ఫోన్ చేసి అభినందనలు చెప్పటం అతడికి క్రొత్త. అందులోనూ అమ్మాయి చెప్పటం మరీ కొత్త.

"థ్యాంక్స్. మీ పేరు?"

"పేరెందుకు?" అన్నదా అమ్మాయి.

రేవంత్ విస్మయంతో "అదేమిటి? పేరు చెప్తే నష్టం ఏముంది?" అన్నాడు.

"లాభం మాత్రం ఏముంది? మీకు తెలియాల్సిందల్లా మీ విజయాన్ని గమనించిన ఒక అభిమాని మీకు అభినందనలు తెలుపుతూ ఉందని. అంతేకదా".

"కానీ చెప్పటం వల్ల నాకు కొద్దిగా సంతృప్తి వస్తుంది. మళ్ళీ ఎప్పుడైనా గుర్తు తెచ్చుకుంటే 'ఫలానా అమ్మాయి ఫోన్ చేసింది కదా' అని ఊహించుకోవటానికి బావుంటుంది" సమర్థించుకుంటూ అన్నాడు రేవంత్.

రేవంత్ పడుతూన్న అవస్థ చూసి "ఏమిటి విషయం" అని అడిగాడు జేమ్స్.

మౌత్‌పీస్‌కి చెయ్యి అడ్డుపెట్టి, "ఎవరో అమ్మాయి అభినందనలు చెబుతోంది" అని, మళ్ళీ తిరిగి ఫోన్లో "ఏం? నా ఆర్గ్యుమెంట్ కరక్టేనా!" అని ప్రశ్నించాడు.

"నా పేరూ..." అంటూ చెప్పబోయి ఆగి "నా పేరు మొదటి అక్షరం 'ఆర్'. దీన్ని బట్టి కనుక్కోండి" అంది.

అతడు తెల్లబోయి "ఎలా కనుక్కోవటం?" అని అడిగాడు.

"పెద్ద చదరంగం ప్లేయర్ కదా. ఆ మాత్రం కనుక్కోలేరా? ఆర్ అన్న అక్షరంతో ప్రారంభం అయ్యే తెలుగు అమ్మాయిల పేర్లు ఎన్నుంటాయేమిటి?" అని నవ్వి "అరగంట తరువాత ఫోన్ చేస్తాను. ఈ లోపులో వీలైనన్ని నోట్ చేసుకుని ఉంచండి" అని ఫోన్ పెట్టేసింది.

రెండు నిముషాల తరువాత చూస్తే స్నేహితులిద్దరూ కాగితం, కలాలతో కుస్తీ పడుతున్నారు.

రాధ – రాధిక – రమణి – అన్న మూడు పేర్లు తట్టినయ్. అప్పటికే ఐదు నిముషాలు గడిచాయి.

రేవంత్ తల విదిలిస్తూ "ఉహూ. ఇదేమీ లాభం లేదు గురూ" అన్నాడు. పులిమీద పుట్రలా జనరల్ మేనేజర్ పిలుస్తున్నారని ప్యూన్ వచ్చి చెప్పాడు.

రేవంత్ జి.ఎం. రూమ్‌కి వెళ్ళేసరికి ఆయన పియ్యే మీద ఎగిరి పడుతున్నాడు. అయిదింటికి మీటింగ్ పెట్టుకుని నాలుగింటికి ఇంటర్వ్యూలు ఎలా ఏర్పాటు చేశావని తిడుతున్నాడు. రేవంత్ వెళ్ళగానే "చూడవోయ్, పదహారుమంది కాండేట్స్‌ని గంటలో ఇంటర్వ్యూ చెయ్యాలట. ఇదేమన్నా సాధ్యమా?" అన్నాడు.

రేవంత్ మాట్లాడలేదు.

మళ్ళీ ఆయనే "ఇదేం లాభం లేదుగానీ రేవంత్, కమిటీ రూమ్‌లో కూర్చొని నువ్వు నలుగురిని సెలక్ట్ చెయ్యి. ఇదంతా అరగంటలో జరిగిపోవాలి. ఆ నలుగుర్లో ఒకర్ని నేను ఫైనల్‌గా సెలెక్ట్ చేసుకుంటాను. క్విక్. మళ్ళీ ఆ తరువాత నాకు ఇంకో మీటింగుంది" అంటూ ఫైలు చదవటంలో మునిగిపోయాడు.

రేవంత్ బైటికొచ్చాడు.

ఆయన గంటలో చెయ్యలేనిది తను అరగంటలో ఎలా చెయ్యగలడో అతనికి అర్థం కాలేదు. పోనీ గంటా తనకే ఇచ్చి ఒకర్ని సెలక్టు చెయ్యమనొచ్చుగా. ఊహూ. మళ్ళీ ఫైనల్ అథారిటీ తన చేతిలోనే ఉంచుకోవాలి. అతనికి నవ్వొచ్చింది. బ్యూరోక్రసీకి పరాకాష్ట.

వరండాలో కాండేట్లు కుర్చీల్లోనూ, సోఫాల్లోనూ సర్దుకుని కూర్చుని ఉన్నారు. తాయిలం కోసం చూసే చిన్నపిల్లల్లా ఉన్నాయి వాళ్ళ మొహాలు. ఎనిమిది మంది అబ్బాయిలూ, ఎనిమిది మంది అమ్మాయిలూ. అందరూ తెలివైన వాళ్ళలాగే కనబడుతున్నారు.

వాళ్ళను చూసేసరికి రేవంత్‌కి ఫ్లాష్ లాంటి ఆలోచన తట్టింది. కమిటీ రూమ్‌లో కూర్చుని, వాళ్ళని లోపలకి పంపమని సెక్రటరీతో చెప్పాడు.

"ఒక్కొక్కర్ని పంపమంటారా?" సెక్రటరీ అడిగాడు.

"కాదు. అందర్నీ పంపు."

సెక్రటరీ అతడివైపు విచిత్రంగా చూశాడు. అతడి అనుమానం గ్రహించి

"ఒక్కొక్కర్ని ఇంటర్వ్యూ చేయాలంటే అరగంటలో సాధ్యం కాదు. మాస్ ఇంటర్వ్యూ చేద్దాం" అన్నాడు.

సెక్రటరీ బయటికి వెళ్ళిన నిముషానికి బిలబిలమంటూ అభ్యర్థులు లోపలికి వచ్చారు. "కూర్చోండి" అన్నాడు రేవంత్. బోర్డు రూము మధ్యలో ఉన్న బల్ల చుట్టూ కుర్చీల్లో కూర్చున్నారు వాళ్ళంతా.

రేవంత్ నిలబడి కంఠం సర్దుకొని, రాజకీయ ఉపన్యాసంలా చెప్పటం ప్రారంభించాడు: "ఇటీవలి కాలంలో అభ్యర్థుల్ని ఎంపిక చేసుకోవటం కోసం రకరకాల సైంటిఫిక్ పద్ధతులు వచ్చాయి. పూర్వంలా చరిత్ర, భూగోళంలో ప్రశ్నలు అడగటం లేదు. తెలివితేటల్ని పరీక్షించటానికి ఓ కొత్త పద్ధతి ఇంటలిజెన్స్ కోషియెన్సీ..! అంటే ఐ.క్యూ. టెస్ట్..! ఆ పరీక్ష ద్వారా మీలో నలుగుర్ని ఎన్నుకుని ఫైనల్ ఇంటర్వ్యూకి మా జనరల్ మేనేజర్ దగ్గరికి పంపుతాను". ఊపిరి తీసుకోవటానికి ఆగి, తిరిగి చెప్పటం ప్రారంభించాడు. "ఐ.క్యూ. టెస్ట్‌లో లెక్కలు, కరెంట్ అఫైర్స్ వగైరా ఏదయినా అడగవచ్చు. కానీ పెమన్సులా ప్రొడక్టు తెలుగువారికి ప్రియమైనవి. ముఖ్యంగా తెలుగు అమ్మాయిలకి..! అందుకని మీకో పరీక్ష పెడుతున్నాను. 'ఆర్'తో ప్రారంభం అయ్యే తెలుగు అమ్మాయిల పేర్లు వ్రాయండి. పదిహేను నిముషాల్లో ఎక్కువ పేర్లు వ్రాసిన నలుగురూ ఫైనల్ ఇంటర్వ్యూకి వెళ్తారు".

అతడి మాటలు పూర్తి కాకముందే 'కౌన్ బనేగా కరోర్ పతి' లోలా అప్పుడే ఇద్దరు ముగ్గురు వ్రాసెయ్యటం మొదలుపెట్టారు. కొంతమందికి వెంటనే అర్థం కాలేదు. నిముషం తరువాత ట్యూబ్‌లైట్ వెలిగి, కలాలు కాగితాల మీద పెట్టారు.

అయిదు నిముషాలు తలెత్తకుండా వ్రాశాక పైకప్పుకేసి చూసేవాళ్ళూ, గోళ్ళు కొరుక్కుంటూ ఆలోచించేవాళ్ళూ, ఓరగా పక్కవారి కాగితాల్లోకి చూసేవాళ్ళూ తయారయ్యారు. చాలామంది పది, పదకొండు కన్నా ఎక్కువ వ్రాయలేదు. కొంతమంది క్రిష్టియన్, ముస్లిమ్ పేర్లు కూడా వ్రాసేరు. ఒకమ్మాయి మాత్రం ఎక్కువ వ్రాసింది.

ఎక్కువ పేర్లు వ్రాసిన నలుగుర్ని సెలక్టు చేసి జనరల్ మేనేజర్ దగ్గరికి పంపి, ఆ కాగితాలు పట్టుకుని రేవంత్ తన ఛాంబర్‌కి వచ్చేశాడు. ఆ అమ్మాయి దగ్గర్నుంచి ఫోన్ రావటానికి ఇంకా పది నిముషాలుంది.

"ఇంత ఆలస్యం అయిందే" జేమ్స్ అడిగాడు. తను చేసిన పని చెప్పాడు రేవంత్.

జేమ్స్ అదిరిపోయి, "నిజంగా నీది చదరంగం బుర్రే బాసూ" అంటూ అభినందించాడు. రేవంత్ నవ్వి తన చేతిలో ఉన్న కాగితాల వంక చూస్తూ, "అన్నీ అలా కలిసివచ్చాయి" అన్నాడు.

ఇద్దరూ కలిసి కామన్ పేర్లు తీసేసి, ఫైనల్ లిస్టు తయారు చేసేసరికి మరో పదినిముషాలు పట్టింది. ఆ పై మరో అయిదు నిముషాలకి ఫోన్ మోగింది. దానికోసమే చూస్తున్నట్టు రేవంత్ చప్పున రిసీవర్ అందుకున్నాడు.

"కనుక్కున్నారా?" అట్నుంచి చిన్న నవ్వుతో అమ్మాయి స్వరం.

"ఆఁ. చాలా పేర్లున్నాయ్"

"చెప్పండి. అందులో నా పేరుంటే ఈ రోజే మీ ఆఫీసుకొచ్చి స్వయంగా అభినందిస్తాను. చదరంగంలో గెల్చినందుకు కాదు. నేను పెట్టిన పోటీలో గెల్చినందుకు."

రేవంత్ మొహం ఉక్రోషంతో ఎర్రబడింది. "అంత కష్టమేమీ కాదనుకుంటాను. అయితే ఒక షరతు. మీ పూర్తి పేరు నేను చెప్పలేకపోవచ్చు. ఉదాహరణకి మీ పేరు 'రమణీప్రియ' అనుకోండి. నేను రమణి అని చెప్పినా, ప్రియా అని చెప్పిన అది కరెక్టే" అన్నాడు.

"ఓ.కే."

పేర్లు ఫైనలైజ్ చేసిన కాగితం తీసుకుని చదవటం మొదలు పెట్టాడు రేవంత్.

"రాధ"

"కాదు"

"రజని"

"కాదు"

జేమ్స్ ఊపిరి బిగపట్టాడు.

"రాజ్యలక్ష్మి... రోజా"

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Vennello+Aadapilla+Revised**

* * *